ప్రజాశక్తి
గురువారం 31 జులై 2025
5
విజయనగరం

స్నేహభావంతో సేవలందించాలి

జిల్లా రిజిస్ట్రార్ ఉపేంద్ర

ప్రజాశక్తి -చీపురుపల్లి

స్నేహభావంతో వినియోగదారులకుసేవలందించాలని జిల్లా రిజిస్ట్రార్ తంగుడు ఉపేంద్ర అధికారులకు సూచించారు. విధులలో భాగంగా బుధవారం చీపురుపల్లి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా కార్యాలయంలోని రికార్డులతో పాటు ఆన్‌లైన్ ద్వారా అందుతున్న సేవల గురించి అక్కడున్న వినియోగదారులను అడిగి తెలుసుకున్నారు. పనుల కోసం కార్యాలయానికి వచ్చిన వారి పట్ల స్నేహపూర్వకంగా వ్యవహరించాలని అధికారులకు సూచించారు. కార్యాలయంలోని రికార్డులను, ఆన్‌లైన్ సేవలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. జిల్లా రిజిస్ట్రార్‌తో పాటుకార్యాలయ సిబ్బంది బంగార్రాజు, చీపురుపల్లి సబ్‌రిజిస్ట్రార్ టివివికె లక్ష్మణరావు, కార్యాలయ సిబ్బంది బంగార్రాజు, నరేష్‌లు ఉన్నారు.

'నేను అమలు చేసిందే మెనూ.. మీకు ఇష్టమైతే తినండి.. లేదంటే మీ ఇష్టం వచ్చినట్లు చేసుకోండి.' అంటూ అక్కడ వార్డెన్ హుకుం జారీ చేయడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు వసతిగృహ పరిశీలనలో వార్డెన్‌ను హెచ్చరించినా తీరు మారకపోవడంతో విద్యార్థులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారు.

పెట్టిందే మెనూ ఇష్టముంటే తిను

- విద్యార్థులకు వార్డెన్ హుకుం
- కుళ్లిన గుడ్లు, పురుగులతో కూడిన భోజనం
- అక్కడ వాచ్‌మేనే వంట మాస్టరు
- అధికారులు వార్నింగ్ ఇచ్చినా తీరు మారని వైనం
- విద్యార్థులకు ఇక్కట్లు

అన్నం, కూరలో పురుగులు

ప్రజాశక్తి-చీపురుపల్లి

చీపురుపల్లిలో అగ్నిమాపక కేంద్రం వెనుక భాగాన ఉన్న కళాశాలల విద్యార్థుల బిసి వసతి గృహంలో చీపురుపల్లి, గరివిడి మండలాల్లో 7 కళాశాలలకు చెందిన సుమారు 180 మంది పేద విద్యార్థులు ఉండేవారు. కనీస వసతులు లేకపోవడంతో తాజాగా ఆ వసతి గృహంలో సుమారు 90 మంది విద్యార్థులు ప్రస్తుతం ఉన్నారు. హాస్టల్‌లో కనీస వసతులు కూడా లేకపోవడం, నాసిరకం భోజనం పెట్టడంతో విద్యార్థులు ఆవేదన చెందుతున్నారు. విద్యార్థుల ఫిర్యాదుతో ఇటీవల బిసి సంక్షేమశాఖ అధికారులు హాస్టల్‌ను పరిశీలించారు. విద్యార్థులు తమ సమస్యలన్నీ విన్నవించారు. అయినప్పటికీ ఆ వార్డెన్ వ్యవహార శైలి మారలేదు కదా మరింత దురుసుగా వ్యవహరిస్తున్నారని విద్యార్థులు అంటున్నారు. ప్రభుత్వం ఇచ్చిన మెనూను అమలు చేయడం లేదని చెబుతున్నారు. కుల్లిన కోడిగుడ్లు, పురుగుల అన్నంతో పాటు ప్రతీ రోజు నాణ్యత లేని ఆహారం పెడుతున్నారని వాపోతున్నారు. దీంతో తాము ఒక పక్క చదువుతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సంబంధించిన ఉద్యోగాలకు ప్రిపేరు అవుతున్న తరుణంలో నాసిరకంగా భోజనంతో అనారోగ్యాల పాలవుతున్నామంటూ విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతే గాకుండా ఇక్కడ వంట మనిషి ఉన్నప్పటికీ వాచ్‌మెన్ వంట చేయడం విశేషం. బంగాళాదుంప, కేబేజితో పాటు వారానికి ఒక సారి పులుసుతో కూడిన రెండు చికెన్ ముక్కలను మాత్రమే వడ్డిస్తున్నారని తెలిపారు. మరోవైపు వసతి గృహంలో బాత్‌రూమ్‌లు అధ్వానంగా మారి కంపు కొడుతున్నాయని, విద్యార్థులు నీరు ఎక్కువగా వాడుతున్నారనే నెపంతో వాష్‌బేషిన్‌లకు ఉన్న వాటర్ కనెక్షన్లను కూడా తప్పించి వార్డెన్ తన పైశాచికాన్ని విద్యార్థుల పట్ల చూపిస్తున్నారంటూ విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వసతి గృహానికి అవసరమయ్యే నీటిని సరఫరా చేసే ప్రధాన ట్యాంకులను కూడా పరిశుభ్రం చేయడం లేదు. ఇంత జరుగుతున్నప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదని విద్యార్థులు ఆవేదన చెందుతున్నారు. వెంటనే తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నారు.

కుళ్లిపోయిన గుడ్లు

శుభ్రం చేయకుండా వదిలేసిన మరుగుదొడ్లు

ప్రభుత్వం నిధులు విడుదల చేయడం లేదు

వసతి గృహంలో మౌలిక వసతుల కల్పనకు సంబంధించి ప్రభుత్వం నుండి నిధులు విడుదల కావడం లేదు. విద్యార్థులకు కనీస సౌకర్యాలు కల్పిస్తున్నాం.

- భాషా, వసతి గృహం వార్డెన్

వార్డెన్‌కి ఇప్పటికే మెమో ఇచ్చాం

వార్డెన్ భాషా వ్యవహారశైలి పట్ల ఇప్పటికే విద్యార్థులు మాకు ఫిర్యాదు చేశారు. ఇటీవలే వసతి గృహాన్ని సందర్శించాను. విద్యార్థులు ఇచ్చిన ఫిర్యాదులు వాస్తవమేనని గ్రహించి వార్డెన్‌కు మెమో కూడా జారీ చేశాం. మరోసారి వసతి గృహాన్ని సందర్శించి తగు చర్యలు తీసుకుంటాం.

- జ్యోతిశ్రీ, డిసిబిడబ్ల్యుఒ

వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ బిఆర్ అంబేద్కర్

దత్తత స్వచ్ఛందం...అదొక సామాజిక బాధ్యత

బంగారు కుటుంబాల అవసరాలను గుర్తించండి : కలెక్టర్

ప్రజాశక్తి-కంటోన్మెంట్

బంగారు కుటుంబాలను దత్తత తీసుకోవడం అన్నది స్వచ్ఛందమేనని, ఏ ఉద్యోగిపైనా ఒత్తిడి తేవడం లేదని జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ స్పష్టం చేశారు. ఇదొక సామాజిక బాధ్యతగా గుర్తించి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. వివిధ శాఖల జిల్లా అధికారులు, మండల ప్రత్యేకాధికారులు, ఎంపిడిఒలు, మున్సిపల్ కమిషనర్లు, తాహశీల్దార్లు, ఇతర మండల, డివిజన్ అధికారులతో బుధవారం జిల్లా కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పి 4, సీజనల్ వ్యాధులు, వ్యవసాయం, పెన్షన్ల పంపిణీపై సమీక్షించారు.

బంగారు కుటుంబాల అవసరాలను గుర్తించాలి

జిల్లాలో ఇప్పటికే సుమారు 67,066 బంగారు కుటుంబాలను గుర్తించామని, మూడు రోజుల్లో సర్వే పూర్తిచేసి, వారి వాస్తవ అవసరాలను గుర్తించాలని కలెక్టర్ ఆదేశించారు. శనివారం నాటికి ఈ జాబితాను అందజేయాలని స్పష్టం చేశారు. వారి అవసరాలకు అనుగుణంగా మార్గదర్శకులను గుర్తించాలని సూచించారు. బంగారు కుటుంబాల దత్తత విషయంలో ఉద్యోగులపై ఎటువంటి ఒత్తిడి చేయడం లేదని అన్నారు. ఈ విషయంలో జరుగుతున్న తప్పుడు ప్రచారానికి అడ్డుకట్ట వేయాలన్నారు. పేదరికంలో ఉన్న వారి వృద్ధిలోకి తేవడం ఒక సామాజిక బాధ్యతగా గుర్తించి స్వచ్ఛందంగా ముందుకు వచ్చేలా చైతన్యపరచాలని సూచించారు.

సీజనల్ వ్యాధులను అరికట్టాలి

ఈ వర్షాకాలంలో ఎక్కడా సీజనల్ వ్యాధులు ప్రభలకుండా చూడాలని కలెక్టర్ ఆదేశించారు. ఎక్కడైనా వ్యాధులు ప్రభలితే ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. కాలువల్లో ఎక్కడా త్రాగునీటి పైపులైన్లు లేకుండా చూడాలని ఆదేశించారు. పారిశుధ్యం, ఇతర కార్యక్రమాలను పర్యవేక్షించేందుకు ప్రతీ గ్రామానికి మండల స్థాయి అధికారిని ప్రత్యేకాధికారిగా నియమించాలని, సాయంత్రానికి జాబితాలను పంపించాలని ఆదేశించారు.

ఎరువుల కొరత లేదు

జిల్లాలో ఎరువుల కొరత లేదని కలెక్టర్ మరోమారు స్పష్టం చేశారు. ఇప్పటి అవసరాలకు తగినంతగా యూరియా నిల్వలు ఉన్నాయన్నారు. సాధారణ యూరియాకు బదులుగా నానో యూరియాను వినియోగించాలని సూచించారు. జిల్లాలో నానో యూరియా 12,000 బాటిళ్ళు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. అవసరానికి మించి యూరియాను వాడటం అనర్ధదాయమని అన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ ఛాంబర్ నుంచి జెసి ఎస్.సేతు మాధవన్, సిపిఒ పి.బాలాజీ, జెడ్‌పి సిఇఒ బివి సత్యనారాయణ, డిప్యూటీ సిఇఒ రామన్, డిఆర్‌డిఎ ఏపిడి సావిత్రి, డిఎంఅండ్‌హెచ్ డాక్టర్ జీవనరాణి తదితరులు పాల్గొన్నారు.

ప్రమాణ స్వీకారం చేస్తున్న చేస్తున్న ఎఎంసి పాలకవర్గ సభ్యులు

ఎఎంసి పాలకవర్గం ప్రమాణ స్వీకారం

వ్యవసాయ మార్కెట్ అభివృద్ధికి కృషి చేస్తాం : చైర్మన్

ప్రజాశక్తి-విజయనగరం కోట

విజయనగరం వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గం ప్రమాణ స్వీకారం బుధవారం ఎఎంసి కార్యాలయంలో జరిగింది. నూతన చైర్మన్‌గా నర్సింగరావు, వైస్ చైర్మన్‌గా చంద్ర నాయుడు, పలువురు డైరెక్టర్లు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ నర్సింగరావు మాట్లాడుతూ మార్కెట్ కమిటీ అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. వైస్ చైర్మన్ చంద్రనాయుడు మాట్లాడుతూ మాకు ఈ అవకాశం ఇచ్చిన అశోక్ గజపతిరాజు స్థానిక ఎమ్మెల్యే పూసపాటి అతిధి విజయలక్ష్మి గజపతిరాజు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు పాలకమండలి సభ్యులు మాట్లాడుతూ రైతులకు అండగా ఉంటూ వారి సంక్షేమానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో మార్కెటింగ్ కమిటీ డైరెక్టర్ నారం శెట్టి రమణమ్మ, చింతపల్లి రమణమ్మ. ఇతర డైరెక్టర్లు, రాష్ట్ర తూర్పు కాపు చైర్మన్ పాలవలస యశస్విని, టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవిపి రాజు, పట్టణ అధ్యక్షులు ప్రసాదుల లక్ష్మీ వరప్రసాద్, మండల పార్టీ అధ్యక్షులు బొద్దల నర్సింగరావు, కార్యదర్శి గంటా శ్రీనివాసరావు, జొన్నవలస ఎంపిటిసి రాజేష్ బాబు, రాకోడు ఎంపిటిపి వేచలపు శ్రీనివాసరావు, బియ్యాల పేట సర్పంచ్ పడగల అబద్ధం, రామకష్ణ , మలిచర్ల టిడిపి నాయకులు తుమ్మగంటి రామారావు , కొసర శివ, వ్యవసాయ శాఖ మార్కెటింగ్‌శాఖ ఎడి బి. రవి కిరణ్, సెక్రెటరీ భారతి తదితరులు పాల్గొన్నారు.

హాస్టల్ సమస్యలు పరిష్కరించాలి

జెఎన్‌టియుజివి గేటు వద్ద విద్యార్థులు ఆందోళన ● దిగి వచ్చిన యాజమాన్యం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జెఎన్‌టియుజివి హాస్టల్లో సమస్యలతో విద్యార్థులు తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి ఉన్నఫలంగా ఫీజు బకాయి ఉందని చెప్పి హాస్టల్ నుండి కట్టు బట్టలతో తాళాలు వేసి బయటకు పంపించేశారు. దీంతో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మంగళవారం అర్ధరాత్రి విద్యార్థులు ధర్నాకు దిగారు. యాజమాన్యం తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతి సంవత్సరం విద్యార్థుల నుంచి మెయింటెనెన్స్ అని చెప్పి రూ.7500 రూపాయలు ఒక్కో విద్యార్థి దగ్గర్నుంచి వసూలు చేస్తున్నా ఎటువంటి సౌకర్యాలు కల్పించడం లేదని ఆవేదన చెందారు. స్టడీ సర్టిఫికెట్ కోసం పర్మిషన్ల కోసం అని చెప్పి ప్రతిదానికి డబ్బులు వసూలు చేస్తున్నారని తెలిపారు. ముందస్తు సమాచారం ఇవ్వకుండా ఉన్నఫలంగా సివిల్, మెటలార్జికల్ బ్రాంచ్ కోర్సులు మార్చాని, దీనివలన విపరీతంగా ఫీజులు పెరిగి కట్టుకోలేని పరిస్థితి ఏర్పడిందని అన్నారు. దీంతో ప్రిన్సిపాల్ వచ్చి సమస్యలు పరిష్కరిస్తామని చెప్పడంతో ధర్నా విరమించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు డి.రాము, జిల్లా సహాయ కార్యదర్శి రమేష్, జగదీష్, చిన్నబాబు, రవి, పట్టణ అధ్యక్షులు సూరిబాబు, అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

ధర్నా చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు

221 అంగన్‌వాడీ కేంద్రాల్లో మరుగుదొడ్లు

ప్రజాశక్తి-కంటోన్మెంట్

స్వచ్ఛభారత్ మిషన్ కార్పొరేషన్ ద్వారా జిల్లాలోని 147 అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్మాణంలో ఉన్న మరుగుదొడ్లను ఆగస్టు 15 నాటికి పూర్తిచేయాలని కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆదేశించారు. మరుగుదొడ్ల నిర్మాణంపై తమ ఛాంబర్లో బుధవారం వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. మరో 74 కేంద్రాల్లో మరుగుదొడ్ల నిర్మాణానికి స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్‌కు ప్రతిపాదనలు పంపించాలని సూచించారు. ఒకటిరెండు రోజుల్లో వీటికి అనుమతి తెప్పిస్తామని, ఆగస్టు 20 నాటికి వీటిని కూడా పూర్తి చేయాలని చెప్పారు. 144 అంగన్వాడీ కేంద్రాలకు ఆగస్టు 20లోగా నీటి సదుపాయం కల్పించాలని ఆదేశించారు. ఆగస్టు మొదటి వారానికల్లా 31 అంగన్‌వాడీ కేంద్రాలకు విద్యుత్ సదుపాయం కల్పించాలని సూచించారు. సమావేశంలో ఐసిడిఎస్ పీడీ టి.విమలారాణి, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ కవిత, ఎపిఇపిడిసిఎల్ ఎస్ఇ ఎం.లక్ష్మణరావు పాల్గొన్నారు.

స.హ చట్టంపై అవగాహన

ప్రజాశక్తి-విజయనగరంకోట

పట్టు, ఉద్యాన శాఖల సంచాలకుల ఆదేశాల మేరకు పట్టు శాఖ లో పని చేస్తున్న అధికారులకు, జిల్లా శాఖ కార్యాలయ సిబ్బందికి, సమాచార హక్కు చట్టం పై బుధవారం వేణుగోపాల పురంలో నున్న పట్టు శాఖ కార్యాలయంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా పట్టు అధికారి సాల్మన్ రాజు ఆధ్వర్యం లో జరిగిన ఈ కార్యక్రమం లో డివిజినల్ పౌర సంబంధాల అధికారి ఎస్.జానకమ్మ సమాచార హక్కు చట్టం ప్రాముఖ్యతను, పిఐఒ, ఎపిఐఒ బాధ్యతలను వివరించారు. దరఖాస్తులను నిర్దేశిత గడువు లోగా డిస్పోజ్ చేయాలని, లేదంటే పెనాల్టీ చెల్లించవలసి వస్తుందని వివరించారు.

10లోపు వీధి విక్రయదారులకు గుర్తింపు కార్డులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగర వ్యాప్తంగా గుర్తించిన వీధివిక్రయదారులకు ఆగస్టు 10వ తేదీ లోపు గుర్తింపు కార్డులను అందజేయాలని వెల్ఫేర్ కార్యదర్శులకు, కమ్యూనిటీ ఆర్గనైజర్లకు నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య ఆదేశించారు. బుధవారం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటికే పూర్తి చేసిన సర్వే వివరాలు ప్రకారం వీధివిక్రయదారులకు వెల్డింగ్ సర్టిఫికెట్లతో పాటు గుర్తింపు కార్డులను కూడా అందించాల్సి ఉందన్నారు.

ప్రిన్సిపల్ సెక్రటరీ ఆదేశాల మేరకు ఆగస్టు 10వ తేదీ లోపు 150 రూపాయలు స్వీకరించి గుర్తింపు కార్డులను, వెండింగ్ సర్టిఫికెట్లను అందజేయాలని చెప్పారు. సమావేశంలో టిపిఆర్ఒ సింహాచలం పాల్గొన్నారు.

ఎక్కించారు.. దించేశారు

ఆర్‌టిసి అధికారుల నిర్వాకం ● ప్రయాణికులకు అవస్థలు

ప్రజాశక్తి-విజయనగరం కోట

విజయనగరం ఆర్టీసీ డిపో నుంచి పార్వతీపురం వెళ్లడానికి బుధవారం ఉదయం బస్సెక్కిన ప్రయాణికులను ఒకసారిగా బస్సులో నుంచి దించేయడంతో వారంతా అవస్థలు పడ్డారు. విజయనగరం డిపో నుంచి పార్వతీపురం వెళ్లాల్సిన పల్లె వెలుగు బస్సు (ఎపి 35జెడ్, 0187) విజయనగరం డిపో పాయింట్ వద్దకు రావడంతో ప్రయాణికులు పార్వతీపురం వెళ్లేందుకు బస్సు ఎక్కారు. బస్సును స్టార్ట్ చేసిన డ్రైవరు పాయింట్ నుంచి పార్వతీపురం రూట్లోకి వెళ్దాం అనేసరికి బస్సు బ్యాక్ వీల్ టైర్లు గాలి లేకపోవడం గమనించారు. ప్రయాణికులను ఇబ్బంది పెట్టకూడదనే ఉద్దేశంతో వారితో పాటు బస్‌ను డిపో గ్యారేజీకి తరలించారు సెక్యూరిటీ సిబ్బంది ఏం జరిగిందని బస్సు డ్రైవర్‌ను ప్రశ్నించడంతో గాలి లేదని, పంచర్ అయిందేమో తెలియడం లేదని చెప్పారు. ప్రయాణికులను దించితే కదా మెకానికులు దాన్ని చూడగలరని అనడంతో డ్రైవర్ గాలి చెక్ చేస్తారేమోనని తీసుకొచ్చానని చెప్పారు. కుదరదని సెక్యూరిటీ అనడంతో ప్రయాణికులను బస్సు నుంచి దించేశారు. దీంతో వారంతా ఆగ్రహం వ్యక్తం చేశారు. బస్సులను ముందుగా చెక్ చేయకుండా ఎలా నడుపుతారంటూ అధికారులను ప్రశ్నించారు. ఇదే బస్సు రన్నింగ్‌లో ఉంటుండగా ఒక్కసారిగా గాలి తగ్గడం లేదా పంచర్ అయి ఉంటే ప్రయాణికుల పరిస్థితి ఏమిటి అంటూ ఆందోళన చెందారు. ఇదిలా ఉండగా రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంపై అన్ని జిల్లాల ప్రజా రవాణా అధికారులకు, డిపో మేనేజర్లకు బస్సులను ఎప్పటికప్పుడు చెక్ చేసి కండిషన్‌లో ఉంచాలని సూచించారు. అయినా స్థానిక అధికారులు పట్టనట్టు వ్యవహరించడంతో ప్రయాణికులు ఇబ్బంది పడాల్సి వస్తోంది.

బస్సు దిగి వెళ్లిపోతున్న ప్రయాణికులు

సీతం ప్రాంగణ నియామకాల్లో 50 మంది ఎంపిక

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

సీతం ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం ఎమ్ఎస్ఎన్ లాబ్ ఆధ్వర్యాన ప్రాంగణ నియామకాల్లో 50మందిని ఎంపిక చేసినట్లు కళాశాల డైరెక్టర్ మజ్జి శశిభూషణరావు తెలిపారు. హాజరైన అభ్యర్థులకు స్క్రీనింగ్ పరీక్ష నిర్వహించి, ఉత్తీర్ణులైన వారిని ఎంపిక చేశారు. ఈ ఎంపిక ప్రక్రియను మానవ వనరుల శాఖ డిప్యూటీ మేనేజర్ టి. శివ రామకృష్ణ, అడ్మిన్ శాఖ భాస్కర్, ఎగ్జిక్యూటివ్ లక్ష్మి నరసింహ దొర వీరి ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డివి రామ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

అనుచిత పోస్టులపై చర్యలు

ఎస్‌పి వకుల్ జిందాల్

ప్రజాశక్తి-కంటోన్మెంట్

సోషల్ మీడియాలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే విధంగా అనుచితమైన పోస్టులు పెట్టి కుల, మత, రాజకీయ పార్టీల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టే వారిపైనా, వారిని ప్రోత్సహించే వారిపైనా చట్టపరమైన కఠిన చర్యలు తప్పవని ఎస్‌పి వకుల్ జిందల్ తెలిపారు. సోషల్ మీడియాలో పోస్టులు పెట్టి మతాలు, కులాల, రాజకీయ పార్టీల మధ్య విద్వేషాలు రెచ్చగొడుతూ, వ్యక్తిత్వ హనానికి పాల్పడుతూ శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై జిల్లా పోలీసుశాఖ ప్రత్యేకంగా నిఘా పెట్టిందన్నారు. ఇందుకు ఒక పోలీసు బృందాన్ని ప్రత్యేకంగా నియమించి, సోషల్ మీడియాలో వచ్చే పోస్టులను నిరంతరం పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. డెంకాడ మండలం టి.కల్లాలు (చిన మోపాడ) లోగల క్రైస్తవ చర్చి ఆవరణంలోగల యేసు క్రీస్తు విగ్రహంపై ఒక చెట్టు కొమ్మ పడిపోవడం వలన విగ్రహం పాడైపోతే, వాస్తవం తెలుసుకోకుండా శ్రీ గోపీనాధం సాంస్కృతిక సేవా సంస్థ అధ్యక్షులు నాడిశెట్టి శాంతారావు అనే వ్యక్తి సోషల్ మీడియాలో మత విద్వేషాలు రెచ్చగొట్టేలా పోస్టు పెట్టడంతో అతడిపై డెంకాడ పోలీసులు కేసు నమోదు చేసి, విచారణ చేపట్టి, అరెస్టు చేశారని తెలిపారు. వాస్తవాలను వక్రీకరించడం, వాస్తవాలు తెలుసుకోకుండా పోస్టులు చేయడం వలన ఇతరుల మనోభావాలు దెబ్బతింటాయన్న వాస్తవాన్ని ప్రతీఒక్కరూ గమనించాలన్నారు.

మానవ అక్రమ రవాణా.. వ్యవస్థీకృత నేరం

ప్రజాశక్తి - విజయనగరంకోట

ప్రపంచ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా నగరంలోని మహిళా ప్రాంగణంలో బుధవారం న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎ.కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ మానవ అక్రమ రవాణా హేయమైన చర్యని, ఇది వ్యవస్థీకత నేరమని, ఈ దోపిడీని అంతం చేయాలని అన్నారు. మహిళలు చిన్నపిల్లలను అక్రమ రవాణాకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు ఉంటాయన్నారు. అక్రమ రవాణా బాధితులకు రక్షణ నష్టపరిహారం, , పునరావాసం తో పాటు వారికి తగిన న్యాయ సహాయం అందించేందుకు జిల్లా న్యాయ సేవా అధికార సంస్థతో పాటు పోలీసు యంత్రాంగము స్వచ్ఛంద సంస్థలు కలిసికట్టుగా కృషి చేయాలన్నారు. మహిళ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పిల్లల అక్రమ రవాణాపై పోస్టర్‌ను ఈ సందర్భంగా ఆవిష్కరించారు. కార్యక్రమంలో మహిళా పోలీసుస్టేషన్ డిఎస్‌పి ఆర్.గోవిందరావు, ఐసిడిఎస్ పీడీ టి.విమలకుమారి, డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్ ఎస్ డి వి ప్రసాద్ రావు, సిడబ్ల్యుసి చైర్‌పర్సన్ జి.హిమబిందు, డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ బిహెచ్ లక్ష్మి, యూత్ క్లబ్ బెజ్జిపురం స్వచ్ఛంద సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎం.ప్రసాదరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి కృష్ణప్రసాద్

16న పిఆర్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం ఎన్నికలు

ప్రజాశక్తి-కంటోన్మెంట్

పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం జిల్లా కమిటీ ఎన్ని వచ్చేనెల 16న ఉదయం 10.30 గంటలకు జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జరుగనుంది. ఎన్నికల పరిశీలకులుగా విశాఖ జిల్లా పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు ఎస్.సత్తిబాబు, తూర్పు గోదావరి జిల్లా ఎపి ఎన్జీవో జాయింట్ కార్యదర్శి ఎంఎంకె జి ప్రసాద్ వ్యవహరిస్తారు. ఎన్నికల అధికారిగా విజయనగరం జిల్లా ఎన్‌జిఒ అధ్యక్షులు టి.శ్రీధర్ బాబు, సహాయ ఎన్నికల అధికారిగా విజయనగరం పట్టణ అసోసియేట్ అధ్యక్షులు కె.చంద్ర శేఖర్ రావు వ్యవహరిస్తారు. ఉమ్మడి విజయనగరం జిల్లాలోని అన్ని తాలూకా యూనిట్‌లలో ఉన్న ఓటర్లు పాల్గొనాలని ఎన్నికలు అధికారి టి శ్రీధర్ బాబు కోరారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ కార్యాలయం నోటీస్ బోర్డు లో ఎన్నికల నోటిఫికేషన్‌ను అతికించారు. కార్యక్రమంలో ప్రస్తుత జిల్లా అధ్యక్షులు సి.హెచ్.మురళి , ఎన్‌జిఒ జిల్లా కార్యదర్శి ఎ.సురేష్ జిల్లా కార్యవర్గ సభ్యులు కె.బి.శ్రీనివాసరావు, అల్తి రమణ మూర్తి, ఆంజనేయ వర్మ, పరిషత్ యూనిట్ అధ్యక్షులు కెఎస్.శ్రీనివాసరావు, ఎల్‌వి ప్రసాద్ ,పి.విరమణమూర్తి, ఎం.హేమలత,వనిత,సూర్యనారాయణ మూర్తి పాల్గొన్నారు.

అన్నదాత సుఖీభవ సమస్యలు పరిష్కరించాలి

బొబ్బిలి: అన్నదాత సుఖీభవ పథకం అమలులో సాంకేతిక సమస్యలు పరిష్కరించి అర్హులైన రైతులందరికీ అన్నదాత సుఖీభవ అందేలా చూడాలని కలెక్టర్ బిఆర్ అంబేద్కర్‌ను ఎమ్మెల్యే బేబినాయన కోరారు. కలెక్టరేట్‌లో బుధవారం ఆయన అంబేద్కర్‌ను కలిసి పలు సమస్యలను వివరించారు. సాంకేతిక సమస్యతో చాలామంది రైతులకు అన్నదాత సుఖీభవ అందే పరిస్థితి లేదన్నారు. సాంకేతిక సమస్యను పరిష్కరించి అన్నదాత సుఖీభవ అందేలా చూడాలన్నారు. తాగునీటి సమస్య పరిష్కరించి మౌలిక సౌకర్యాలు కల్పనకు చర్యలు తీసుకోవాలని కోరారు. సమస్యలపై కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. జిల్లా ఎస్‌పి వకుల్ జిందాల్‌ను కలిసి మాదకద్రవ్యాలు నివారణకు తీసుకుంటున్న చర్యలపై అభినందించారు.

ఎన్నికల హామీలను అమలు చేయాలి

బొబ్బిలి: ఎన్నికల హామీలను అమలు చేయాలని మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు డిమాండ్ చేశారు. మున్సిపాలిటీలోని గొల్లపల్లి పదో వార్డులో బుధవారం బాబు ష్యూరిటీ - మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎన్నికల హామీలను అమలు చేయకుండా కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసాలను ఇంటింటికి వెళ్లి ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మానవ అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు

బొబ్బిలి: మానవ అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు ఉంటాయని జూనియర్ సివిల్ జడ్జి హేమ స్రవంతి జానకీరామ్ అన్నారు. స్థానిక కోర్టులో బుధవారం మానవ అక్రమ రవాణా సమస్యపై అవగాహన కల్పించారు. మానవ అక్రమ రవాణా చట్టరీత్యా నేరమన్నారు. మానవ అక్రమ రవాణా నివారణకు స్వచ్ఛంద సంస్థలు, ప్రజలు ప్రభుత్వ యంత్రాంగానికి సహాయ సహకారాలు అందించాలని కోరారు. న్యాయవాదులు, ప్రజలు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ పథకాలు పక్కాగా అమలు

నెల్లిమర్ల: చంద్రబాబు నాయకత్వంలో టిడిపి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలు పక్కాగా అమలు చేస్తోందని టిడిపి రాష్ట్ర పరిశీలకులు (విశాఖ ఉత్తర నియోజకవర్గం) సువ్వాడ రవిశేఖర్ తెలిపారు. బుధవారం ఆయన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా వల్లూరు, మల్యాడ, తమ్మాపురం గ్రామాల్లో పర్యటించి సూపర్ సిక్స్ పథకాలుపై ప్రచారం చేసి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అభివృద్ధి సంక్షేమం చంద్రబాబుతోనే సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారుల ప్రతినిధి గేదెల రాజారావు, పంచాది సూర్యనారాయణ మాస్టర్, ఎస్‌సి సెల్ రాష్ట్ర అధికారి ప్రతినిధి పోతల రాజప్పన్న, నాయకులు గురాన రామారావు, పంచాది జగన్, లెంక సన్యాసిరావు, మొంగం శ్రీను, పాల్గొన్నారు.

నవోదయలో హ్యాండ్‌బాల్ మీట్

శృంగవరపుకోట: మండలంలోని కిల్తంపాలెంలోని జవహర్ నవోదయ విద్యాలయంలో హైదరాబాద్ రీజియన్ హ్యాండ్‌బాల్ మీట్ నిర్వహిస్తున్నామని విద్యాలయం ప్రిన్సిపాల్ దుర్గాప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ క్రీడా మహోత్సవంలో దక్షిణ భారతదేశంలోని ఎనిమిది క్లస్టర్లకు చెందిన అథ్లెట్లు పాల్గొన్నారని, వాటిలో యానాం, ఆదిలాబాద్, కన్నూర్, కరైకల్, ఎర్నాకులం, హావేరి, హసన్, కలబుర్గి క్లస్టర్లు ఉన్నాయని పోటీల నిర్వహణకు ఆంధ్రప్రదేశ్ హ్యాండ్‌బాల్ అసోసియేషన్‌కు చెందిన ఎస్.రాజారావు నేతృత్వం వహిస్తున్నారని తెలిపారు. ఈ పోటీల్లో విజేతలుగా ఎంపికయ్యే అథ్లెట్లు రాబోయే రోజుల్లో బీహార్ రాష్ట్రం నలందాలో జరిగే జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో హైదరాబాద్ రీజియన్ తరపున పాల్గొంటారని అన్నారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు

కొత్తవలస: మండలంలోని ఎరువుల షాపులను మండల ప్రత్యేకాధికారి ఎం.అన్నపూర్ణ, ఎఒ కెవి రామ్‌ప్రసాద్ పరిశీలించారు. కాటకాపల్లి గ్రామంలో ఉన్న షాపులను పరిశీలిస్తూ ఎరువుల కృత్రిమ కొరత సృష్టించినా, ఎక్కువ ధరకు అమ్మినా తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రికార్డులు, నిల్వలను పరిశీలించారు. రోజూ స్టాక్ రికార్డుల్లో నమోదు చెయ్యాలని, ఎరువుల నిల్వలు, ధరల వివరాలను నోటీసు బోర్డులో పొందుపరచాలని ఆదేశించారు. రైతులు ప్రతి కొనుగోలుకు బిల్లు తీసుకోవాలని, నానో యూరియా, డిఎపి వాడాలని సూచించారు.

దేవాడలో పారిశుధ్య పనులు

కొత్తవలస: వియ్యంపేట పిహెచ్‌సి పరిధిలోని దేవాడ సచివాలయంలో సర్పంచ్ గంతకూర జయకుమారి, సెక్రటరీ మాధవీలత ఆధ్వర్యంలో బుధవారం కాలువల్లో పూడికతీత, ఓవర్ హెడ్ ట్యాంక్స్ క్లీనింగ్, క్లోరినేషన్ చేయించామని హెల్త్ సూపర్‌వైజర్ ఈశ్వరరావు తెలిపారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు మలేరియా, డెంగీ, టైఫాయిడ్, చికెన్ గునియా, పచ్చకామెర్లు, డైయేరియా వంటివి రాకుండా ఉండాలంటే పరిసరాలు శుభ్రంగా ఉండాలని, హెల్త్ అసిస్టెంట్ సత్యారావు చెప్పారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్ద గంతకూర రమణ, ఇంజనీరింగ్ అసిస్టెంట్ గౌతమి, ఏఎన్‌ఎం దేవి, ఆశ వర్కర్ వరలక్ష్మి, పంపు ఆపరేటర్, గ్రీన్ అంబాసిడర్లు పాల్గొన్నారు.

డయేరియా నియంత్రణపై అవగాహన

రామభద్రపురం: డయేరియా (అతిసార వ్యాధి) నియంత్రణ అవగాహనతోనే సాధ్యమని నాయుడువలస పాఠశాల ఆంగ్ల ఉపాధ్యాయుడు జెసి రాజు అన్నారు. స్టాప్ డయేరియా క్యాంపెన్‌లో భాగంగా 5,6,7,8 తరగతుల విద్యార్థులకు బుధవారం వివిధ పోటీలు నిర్వహించారు. వ్యాసరచన, వక్తృత్వం, చిత్రలేఖనంపై పోటీలు నిర్వహించి ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు బహుమతులు అందించారు. ఈ సందర్భంగా జెసి రాజు మాట్లాడుతూ కలుషిత ఆహారం, నీరు తినటం, తాగటం వల్ల అతిసార వ్యాధి ప్రబలుతుందన్నారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు జగదీశ్వర, రాజమ్మ, కృష్ణంనాయుడు, ఎన్‌వి రమణ విద్యార్థులు పాల్గొన్నారు.

బాలుర వసతి గృహ సందర్శన

వేపాడ: మండలంలోని కొండగంగుపూడిలోని బిసి బాలుర వసతి గృహాన్ని నియోజకవర్గం వైసిపి విద్యార్థి విభాగం అధ్యక్షులు దివ్వల చంద్రశేఖర్ బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా వసతి గృహంలో విద్యార్థులకు సమస్యలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో కలిసి భోజనం చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంలో నియోజకవర్గ వైసిపి విద్యార్థి విభాగం సభ్యులు జాగరపు పార్థసారథి, గొల్ల దేముడు, అల్లు ప్రతాప్, గవిరెడ్డి కళ్యాణ్, కలవలపల్లి రమేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

వేపాడ, కుంపల్లిలో కేంద్ర బృందం పర్యటన

వేపాడ: వేపాడ, కుంపల్లి పంచాయతీల్లో స్వస్థ సర్వేక్షణ్ (గ్రామీణ సర్వే సెంట్రల్ బృందం సభ్యులు హారిక, వినోద్ బుధవారం పర్యటించారు. గ్రామంలో ఉన్న వ్యక్తిగత మరుగుదొడ్ల వినియోగం, పరిసరాల పరిశుభ్రత, డ్రైనేజ్ కాలువలు, అంగన్వాడి సెంటర్, హెల్త్ సెంటర్, ప్రభుత్వ పాఠశాల, చెత్త నుండి సంపద తయారీ కేంద్రాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడిఒ రవికుమార్, స్వచ్ఛభారత్ మండల కోఆర్డినేటర్ రాంబాబు, కుంపల్లి సర్పంచ్ నాయుడు అరుణ, వేపాడ సర్పంచ్ మెలిపాక అర్జునమ్మ, పంచాయతీ కార్యదర్శి కమల, సచివాలయం సిబ్బంది, అంగన్వాడీ ఆశా వర్కర్, వెలుగు సిబ్బంది, ఫీల్డ్ అసిస్టెంట్ తదితరులు పాల్గొన్నారు.

సిఎం సహాయ నిధి చెక్కు అందజేత

డెంకాడ: భోగాపురం మండలంలోని ముంజేరు గ్రామానికి చెందిన పెద్ది ఉమాకి ఎమ్మెల్యే లోకం నాగమాధవి సిఎం సహాయ నిధి చెక్కు రూ. 1.95లక్షలను అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి కట్టుబడి పని చేస్తోందన్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న పేద కుటుంబాలకు సిఎం సహాయ నిధి ద్వారా తక్షణ ఆర్థిక సహాయం అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో భోగాపురం మండల జనసేన నాయకులు పాల్గొన్నారు.

చెరువులో పడి వ్యక్తి మృతి

గంట్యాడ: మండలంలోని రామవరం గ్రామంలో కొల్లి సూరిదేముడు (41) చెరువులో పడి మృతి చెందాడు. సూరిదేముడు బుధవారం అయ్యన్నబంద చెరువుకు బహిర్భూమికి వెళ్లి కాలుజారి పడిపోయాడు. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం విజయనగరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతునికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఎస్‌ఐ సాయి కృష్ణ దర్యాప్తు చేస్తున్నారు.

మిర్తివలస భూములు గిరిజనులకే కేటాయించాలి

విజయనగరం టౌన్: రామభద్రపురం మండలం మిర్తివలస పంచాయతీలో గల ఎంఎస్ఎంఇ గిరిజన భూములు గిరిజనులకే కేటాయించాలని కోరుతూ కలెక్టర్ బిఆర్ అంబేద్కర్‌కు బుధవారం ఆదివాసీ జెసిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు ఎంఎస్ఎంఇ పార్కుకు భూములు ఇవ్వబోమని చెబుతున్నప్పటికీ భూముల లెవెల్ చేస్తున్నారని తెలిపారు. ఎస్. కోట మండలం ముషిడిపల్లి పంచాయతీ భూముల విషయమై సమస్యలను పరిష్కరించాలని కోరారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో జెసిసి చైర్మన్ తమ్మి అప్పలరాజుదొర, గిరిజన నాయకులు, బురిడి లక్ష్మణ, పాలవలస భగవాన్, వాటక తిరుపతిరావు, పాల్గొన్నారు.

స్మార్ట్‌మీటర్ల పేరిట దోపిడీని అరికట్టాలి

ప్రజాశక్తి - బొబ్బిలి

విద్యుత్ స్మార్ట్ మీటర్లు రద్దు చేసి సర్దుబాటు ఛార్జీల దోపిడీని ఆపాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు పి.శంకరరావు, ఎఐటియుసి నాయకులు ఎం.శ్రీనివాసరావు, ఇఫ్టూ నాయకులు పి.లక్ష్మణరావు, రైతు సంక్షేమ సంఘం అధ్యక్షులు వేమిరెడ్డి లక్ష్మునాయుడు, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎస్.గోపాలం డిమాండ్ చేశారు. పట్టణంలో బుధవారం స్మార్ట్ మీటర్లను రద్దు చేసి సర్దుబాటు చార్జీలు దోపిడీని అరికట్టాలని కోరుతూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అదాని స్మార్ట్ మీటర్లు పేరుతో ప్రజలను దోపిడీ చేసేందుకు ప్రభుత్వాలు పూనుకున్నాయన్నారు. అదాని కంపెనీ రాష్ట్రంలో 2కోట్ల మంది వినియోగదారులకు పాత మీటర్లను తొలగించి కొత్త స్మార్ట్ మీటర్లను వేయడం మీటర్ మార్పు కాదని, విద్యుత్ పంపిణీ ప్రైవేటీకరణకు, కార్పోరేట్లకు కట్టబెట్టడానికి చేస్తున్న కుట్ర అని విమర్శించారు. స్మార్ట్ మీటర్లకు, సర్దుబాటు చార్జీలకు వ్యతిరేకంగా ఆగస్టు 5న ఉదయం 10 గంటలకు విద్యుత్ శాఖ డివిజనల్ కార్యాలయం వద్ద నిరసన చేపడతామని చెప్పారు. నిరసనను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ నాయకులు యుగంధర్, ఐద్వా జిల్లా అధ్యక్షురాలు కె.పుణ్యవతి, తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలి: మాట్లాడుతున్న ఐక్యవేదిక నాయకులు

రామభద్రపురం: విద్యుత్ స్మార్ట్ మీటర్ల పేరుతో అధిక ఛార్జీలు వసూలు చేస్తూ, సర్దుబాటు ఛార్జీల రూపంలో ప్రజల నుంచి చేస్తున్న దోపిడీని వెంటనే ఆపాలని సిపిఎం, సిపిఐ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు బలస శ్రీనివాసరావు, అలమండ ఆనందరావు, లంక ఎర్రం నాయుడు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం స్థానిక ఆర్‌టిసి కాంప్లెక్స్ వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వం తొమ్మిది సార్లు విద్యుత్ ఛార్జీలను పెంచి ప్రజలపై రూ.32వేల కోట్లు భారం వేసిందన్నారు. విద్యుత్ బాదుడు ఉండదని చెప్పి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వైసిపి విధానాలనే అమలు చేస్తుందని విమర్శించారు. దీనికి వ్యతిరేకంగా ఆగస్టు 4న ఎలక్ట్రికల్ కార్యాలయల వద్ద నిరసన చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు చిన్నంనాయుడు, అచ్చం నాయుడు, రాంబర్కి తదితరులు పాల్గొన్నారు.

గజపతినగరం రూరల్: విద్యుత్ స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలని, సర్దుబాటు ఛార్జీలు తగ్గించాలని కోరుతూ బుధవారం మండలంలోని బంగారంపేట గ్రామంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు జి. శ్రీనివాసరావు కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో వైసిపి ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు కూటమి నేతలు ముఖ్యంగా లోకేష్ స్మార్ట్ మీటర్లు బద్దలు కొట్టండి అని పిలుపునిచ్చి ఇప్పుడు మోడీ ప్రభుత్వానికి తలవగ్గి అదానికి లాభాలు చేకూర్చే ప్రక్రియకు కూటమి ప్రభుత్వం సిద్ధం

గజపతినగరం: ప్రచార కరపత్రాలను పంపిణీ చేస్తున్న జి. శ్రీనివాస్

అయ్యిందన్నారు. స్మార్ట్ మీటర్లు దొడ్డి దారిన బిగించేదానికి సిద్ధమయ్యారని దీని వల్ల అదానీ కంపెనీ గుప్పెట్లో కరెంటు ఉంటుందని ప్రజలకు చీకటి మిగులుతుందని చెప్పారు. సెల్‌ఫోన్ రీఛార్జి మాదిరిగా రీఛార్జి చేస్తేనే కరెంటు ఉంటుందని ప్రజలు దీన్ని వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు భవిష్యత్తులో రైతులకు, ఎస్‌సి, ఎస్‌టి, మైనార్టీలకు, చిన్నచిన్న షాపులకు ఇచ్చిన రాయితీలు, సబ్సిడీలు గాలిలో కలిసిపోతాయన్నారు. ఈ పాపాలకు మోడీ, వైసిపి, తెలుగుదేశం, జనసేన పార్టీలు కారణం అవుతున్నాయన్నారు. దీనికి వ్యతిరేకంగా ఈ నెల 5వ తేదీన గజపతినగరం కరెంటు ఆఫీస్ వద్ద ధర్నా చేస్తామని అందరూ పాల్గొని జయప్రదం చేయాలి కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి తెరలాపు కృష్ణ, గురయ్యా, గురుమూర్తి, టి.రాము, కె.లక్ష్మణ, కే.నూకరాజు, ఐద్వా నాయకులు టీ.అచ్చియమ్మ, కే.సుందరి, కే.రెబక ముత్యాలమ్మ తదితరులు పాల్గొన్నారు.

కౌన్సిలర్లు, చైర్మన్ మధ్య వాగ్వివాదం

ప్రజాశక్తి - బొబ్బిలి

వైసిపి కౌన్సిలర్లు, మున్సిపల్ చైర్మన్ రాంబార్కి శరత్ బాబు మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. మున్సిపల్ కార్యాలయంలో బుధవారం చైర్మన్ శరత్ అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం జరిగింది. మున్సిపల్ సమావేశానికి కమిషనర్ ఎందుకు రాలేదని వైసిపి కౌన్సిలర్లు ఇంటి గోవిందరావు, పాలవలస ఉమాశంకర్ ప్రశ్నించగా సెలవులో ఉన్నారని ఆర్ఐ సురేష్ సమాధానం చెప్పారు. కమిషనర్ లేకుండా సమావేశం ఎలా నిర్వహిస్తారని వైసిపి కౌన్సిలర్లు నిలదీశారు. కమిషనర్ లేకపోతే ఏదైనా సమస్య ఉంటే చెప్పాలని చైర్మన్ శరత్ కోరగా మాతో మాట్లాడుతున్న అధికారులను బెదిరిస్తున్న మీతో మేము ఏమి చెప్పుకోగలమని వైసిపి కౌన్సిలర్లు అన్నారు. దీంతో కౌన్సిలర్లు, చైర్మన్ మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. దీంతో సమావేశం నుంచి వైసిపి కౌన్సిలర్లు గోవింద్, ఉమా, బాబు, చోడిగంజి రమేష్ వాకౌట్ చేశారు.

ప్రజా సమస్యలపై సుదీర్ఘ చర్చ

వైసిపి కౌన్సిలర్లు వాకౌట్ అనంతరం ప్రజా

చైర్మన్‌ను ప్రశ్నిస్తున్న కౌన్సిలర్లు

సమస్యలపై సుదీర్ఘంగా చర్చ జరిగింది. కౌన్సిలర్ తెంటు పార్వతి మాట్లాడుతూ రైతుల భూముల్లో మాజీ సైనికులకు ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు పెట్టిన తీర్మానాన్ని రద్దు చేయాలని కోరారు. దీనిపై టౌన్ ప్లానింగ్ అధికారి మాట్లాడుతూ తహశీల్దార్ నుంచి వచ్చిన అభ్యర్థనను రీ వెరిఫికేషన్ చేయాలని కోరతామని చెప్పారు. రాణి మల్లమ్మదేవి పార్కులో అసాంఘిక కార్యకలాపాలు నివారణ సీసీ కెమెరాలను చేయాలని, సంపూర్ణంగా తాగునీరు సరఫరా చేయాలని కౌన్సిలర్ ఒమ్మి లక్ష్మి కోరారు. కుక్కలను నివారించాలని, దోమలు నివారణ మందు పిచికారీ చేయాలని కో ఆప్షన్ సభ్యులు రియాజ్ ఖాన్ కోరారు. ఐదో వార్డులో వోల్టేజ్ సమస్య ఉందని, పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కౌన్సిలర్ హైమావతి కోరారు. మున్సిపల్ సమావేశాలను విద్యుత్ శాఖ అధికారులు హాజరయ్యేలా చూడాలని తెంటు పార్వతి కోరారు. ఆరో వార్డులో ఉన్న సామూహిక మరుగుదొడ్లను బాగు చేయాలని కౌన్సిలర్ గెంబలి శ్రీనివాసరావు కోరారు. బజార్ రోడ్డు ఆక్రమణకు గురికావడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతుందని, ఆక్రమణలను తొలగించాలని కోరారు. వరహగిరి సందులో రోడ్డు నిర్మాణం చేయాలని కోరారు. నూతన కుళాయిలు వేపించాలని కౌన్సిలర్లు కోరారు. ఆకుల రెల్లివీధిలో బోరు బాగు చేయాలని, మరో మూడు నూతన బోర్లు వేయాలని కౌన్సిలర్ బొత్స సురేష్ కోరారు. కౌన్సిల్ సమావేశంలో వచ్చిన సమస్యలు పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చైర్మన్ శరత్ అన్నారు.

చోడవరం అంగన్వాడీ కార్యకర్తపై విచారణ

ప్రజాశక్తి- గుర్ల

మండలంలో చోడవరం గ్రామంలో అంగన్వాడీ కార్యకర్తగా పనిచేస్తున్న కొండల బంగారమ్మపై విచారణ జరిగింది. బుధవారం గరివిడి ప్రాజెక్టు ఐసిడిఎస్ అధికారి ఆరుద్ర తమ సిబ్బందితో వెళ్లి విచారణ నిర్వహించారు. ముఖ్యంగా ఫేక్ సర్టిఫికెట్లతో ఆమె ఉద్యోగం పొందిందని ఇచ్చిన ఫిర్యాదు పైన, ఆమెకు విధులకు ఆటంకం కలిగిస్తూ ఇబ్బందులు గురిచేస్తున్నారని కొంతమంది వ్యక్తులపై ఆమె ఫిర్యాదు చేయడంతో రెండింటిపైన విచారణ నిర్వహించారు. మొదటగా ఆమెపై విధులకు ఆటంకం కలిగిస్తున్నారన్న దానిపైన, తరువాత ఫేక్ సర్టిఫికెట్లు తో ఉద్యోగం పొందినట్లు ఇచ్చిన ఫిర్యాదుపైన గ్రామ సచివాలయంలో విచారణ నిర్వహించారు. వాటిపై పూర్తి సమాచారం తెలుసుకొని జిల్లా అధికారులకు నివేదిక అందజేస్తామన్నారు.

భూముల వివరాలతో జిందాల్ రైతుల నిరసన

ప్రజాశక్తి- శృంగవరపుకోట

40 రోజులుగా జిందాల్ మోసాలకు సర్వం కోల్పోయిన తమని ఆదుకోవాలని ఆందోళన చేస్తున్న నిర్వాసతుల పట్ల నిర్లక్ష్యం తగదని సిపిఎం నాయకుడు చల్లా జగన్ ఆవేదన వ్యక్తం చేశారు. బొడ్డవర జిందాల్ బాధితుల శిబిరం వద్ద బుధవారం బాధితులు భూముల వివరాలతో కూడిన ప్రతులను పట్టుకుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చట్టబద్ధంగా తమ భూమి తమకు అప్పగించాలని, భూమి కోల్పోయిన రైతులకు ఉద్యోగం పరిశ్రమలో వాటా వంటి ఒప్పందలు అమలు చేయాలన్న డిమాండ్లతో జిందాల్ యాజమాన్యపై నిర్వాసితులు చేస్తున్న పోరాటంలో పేదల వైపున ఉండవలసిన ప్రభుత్వం నిర్వాసితులను గాలికి వదిలేయడం సిగ్గుచేటు అని అన్నారు. జిందాల్ యాజమాన్యానికి కొమ్ముకాస్తున్న కొంతమంది పెద్దలు నిరసన శిబిరంలో భూమి కోల్పోయిన వారు లేరని విష ప్రచారాలతో పాటు అవాకులు చవాకులకు సమాధానంగానే ప్రతి రైతు చేత తామే భూములు కోల్పోయిన రైతులమని రైతు పేరు, సర్వే నెంబరు, భూ విస్తీర్ణంతో సహా పేపర్ పై రాసి చేతులతో పట్టుకొని నిరసన వ్యక్తం చేశారన్నారు. ఎవరికైనా ఎటువంటి అనుమానాలు అపోహలు ఉన్న తమ వద్దకు

భూ వివరాల పత్రాలతో నిరసన తెలుపుతున్న బాధితులు

వస్తే అన్ని వివరాలతో వారి అనుమానాలను నివృత్తి చేస్తామన్నారు, తమ బాధలు ఏమిటో భూమి కోల్పోయిన వాళ్ళకు మాత్రమే తెలుస్తుందని సెంటు భూము కూడా పోకుండా ఒడ్డున ఉన్న పెద్దలకు ఏం తెలుసనని ప్రశ్నించారు. సర్వం కోల్పోయి, కూలీలుగా మారిన జిందాల్ బాధితులను ఆదుకొని న్యాయం జరిగే వరకు పోరాటం ఉధృతం చేస్తామన్నారు. ఈ ఉద్యమానికి ఇప్పటికే మేధావులు ప్రజాసంఘాలు వివిధ రాజకీయ పక్షాల మద్దతు లభించిందన్నారు. ఈ కార్యక్రమంలో బాధితులు పాల్గొన్నారు.

ఉద్యోగులకు ఘన సన్మానం

ప్రజాశక్తి - పూసపాటిరేగ

భోగాపురం మండలంలోని అమ్మటం రావివలస పంచాయతీ పరిధిలోని పాఠశాలల్లో పనిచేసి పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయుడితో పాటు, బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులు, సచివాలయ ఉద్యోగులకు బుధవారం ఘనంగా పౌర సన్మానం చేశారు. ఈ కార్యక్రమాన్ని పంచాయతీ సర్పంచ్ శివారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. మొత్తం 18 మంది ఉద్యోగులను ఈ సందర్భంగా సన్మానించారు. వారిలో పంచాయతీ కార్యదర్శి కె.స్వర్ణ, డిఎడి బంగారురాజు, ఇఎడి వంశీకృష్ణ, మహిళా పోలీస్ రీనా పాల్, విఆర్‌ఒ వి.గౌతమీ ప్రసన్న, వెల్ఫేర్ అసిస్టెంట్ షేక్ ఆసిఫ్, సర్వేయర్ పృధ్వీరాజ్, అగ్రికల్చర్ అసిస్టెంట్ కె.నారాయణరావు, ఏఎన్‌ఎం వై.సత్యవతి, ఏహెచ్‌ఏటి దేవి ఉన్నారు. పదవీ విరమణ చేయనున్న ఉపాధ్యాయుడు కె.విజయ్ కుమార్,

సన్మాన గ్రహీతలతో సర్పంచ్ శివారెడ్డి

బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులు భారతి, సత్యనారాయణ, ఎం.అంజలీ, ఎం.నయోమి, బి.లలిత, ఎస్. కృష్ణారావు, శేషగిరిరావులకు కూడా ఘన సన్మానం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ తమ పంచాయతీలో అభివృద్ధికి సేవలందించిన ప్రతి ఉద్యోగిని గౌరవించడం తమ బాధ్యత అని వారి సేవలకు గుర్తింపుగా ఈ సన్మానం చేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒతో పాటు రాజకీయ నాయకులు, విద్యావంతులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సస్య రక్షణ చర్యలు చేపట్టాలి

ప్రజాశక్తి - గజపతినగరం రూరల్

రైతులు సాగు చేస్తున్న పంటలపై సస్యరక్షణ చర్యలు చేపట్టాలని వ్యవసాయ శాఖ అధికారి కిరణ్ కుమార్ సూచించారు. బుధవారం పిడిశాల, కాలంరాజుపేట గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతికూల వాతావరణ పరిస్థితుల వల్ల రైతులకు ఇబ్బంది కలగకుండా ఉండేందుకు ప్రతి రైతు తప్పనిసరిగా ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన ద్వారా వరి పంటకు బీమా చేసుకోవాలని కోరారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి వరి పంటకు బీమా చేసుకోవడానికి ఆగస్టు 15 వరకు అవకాశం ఉందని అన్నారు. అంతకుముందు తహశీల్దార్ కార్యాలయంలో మండల వ్యాప్తంగా విఆర్‌ఒల సమావేశం ఏర్పాటు చేశారు. తహశీల్దార్ రత్నకుమార్, ఏడిఏ నిర్మల జ్యోతి ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో విఆర్వోలకు కౌలు కార్డ్‌లు, కౌలు రుణాలు అర్హత ఉన్న ప్రతి రైతుకు పూర్తిస్థాయిలో అందజేయాలని ఆదేశించినట్లు ఏవో కిరణ్ కుమార్ తెలిపారు.

బొబ్బిలిరూరల్ : ఎరువుల వాడకంపై రైతులు అవగాహన కలిగి ఉండాలని ఎఒ యం.శ్యాంసుందర్ తెలిపారు. బుధవారం పిరిడి, అలజంగి గ్రామాలలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రైతూ పంటల యజమాన్యం, ఎరువుల యజమాన్యంపై అవగాహనతో ఉండాలన్నారు. కౌలు రైతులు గుర్తింపు కార్డులు త్వరితన తీసుకొని బ్యాంకు రుణాలు పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన వన అధికారి వెంకట రత్నం, రైతులు, వ్యవసాయ సహాయకులు ఉష, త్రివేణి, లత తదితరులు పాల్గొన్నారు.

బంగార(య్య) కుటుంబం దత్తత

ప్రజాశక్తి - నెల్లిమర్ల

జరజాపు పేట ఉన్నత పాఠశాల గణిత ఉపాధ్యాయుడు శివుకు బంగారయ్య మాస్టర్ బంగారు కుటుంబాన్ని దత్తత తీసుకున్నారు. విజయనగరం ఎల్‌బి నగర్ కాలనీలో నివసిస్తున్న నిరుపేద కుటుంబానికి చెందిన సిబారిక సంతోషి కుటుంబాన్ని బంగారు కుటుంబంగా దత్తత తీసుకున్నారు. ప్రభుత్వ పర్యవేక్షణలో జరుగుతున్న పి 4 సర్వే కార్యక్రమంలో భాగంగా బంగారయ్య మార్గదర్శిగా వుండి బంగారు కుటుంబం దత్తత తీసుకున్నట్లు తెలిపారు. ఈ బంగారు కుటుంబ యజమాని సిబారిక కుమార్, సంతోషి కూలి పనులు చేసుకుంటూ పిల్లలు నిఖిల్ 8వ తరగతి,

దత్తత తీసుకున్న కుటుంబంతో ఉపాధ్యాయుడు బంగారయ్య

నవ్యశ్రీ 6వ తరగతి చదువిస్తున్నారు. ఈ సందర్భంగా మార్గదర్శి బంగారయ్య మాట్లాడుతూ ఇది తన సామాజిక బాధ్యతగా భావిస్తున్నానని తెలిపారు. దత్తత తీసుకున్న కుటుంబానికి ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించడం అవసరమైన సేవలను అందించడం వారికి ఆర్థిక, ఆరోగ్య, విద్య పరమైన మద్దతు కల్పించడం వంటి కార్యక్రమాలు చేపడతానని చెప్పారు.

యాజమాన్య పద్ధతులపై శిక్షణ

ప్రజాశక్తి - రామభద్రపురం

రైతన్నలు పంటలలో మేలైన యాజమాన్య పద్ధతులు అవలంబించి వ్యవసాయాన్ని లాభసాటిగా చేసుకోవాలని వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు మధుసూదనరావు సూచించారు. పిఎం రాష్ట్రీయ కృషి వికాస యోజన కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ ఆదేశాల మేరకు బుధవారం గొల్లపేట, నాయుడువలస రైతు సేవా కేంద్రాల పరిధిలో గల రైతులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎరువు లభ్యత, నానో యూరియా, డిఎపి ఉపయోగాలు, అన్నదాత సుఖీభవ పథకం, పంటల బీమా, ఈ పంటలపై వివరించారు. జిల్లా వనరుల కేంద్రం ఎఒ నిర్మల నారుమళ్ల యాజమాన్యం, వరి పంటలో సమగ్ర సస్యరక్షణ గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఎఒలు శివ, గోవిందమ్మ, ఎఇఒలు శరత్, వెంకటరమణ, రైతులు పాల్గొన్నారు.

జనసేనలో 50 కుటుంబాలు చేరిక

ప్రజాశక్తి- డెంకాడ

మండలంలోని కొండరాజుపేట, గంట్లాం గ్రామాలకు చెందిన 50 వైసిపి కుటుంబాలు బుధవారం జనసేనలో చేరాయి. వీరికి ఎమ్మెల్యే లోకం నాగమాధవి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో వార్డు మెంబర్లు వై. ఆదినారాయణరెడ్డి, బి.యెర్రయ్యరెడ్డి, గుడిమెట్ల అప్పలరాజు, డాకామ్రి గురుమూర్తి ఉన్నారు. భోగాపురం మండలంలోని ముంజేరు పార్టీ కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో డెంకాడ ఎంపిపి బంటుపల్లి వెంకటవాసుదేవరావు, పాలు శ్రీను, మండల స్థాయి జనసేన నాయకులు తదితరులు పాల్గొన్నారు. ,

అరిగిపాలెంలో వైద్య శిబిరం

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని సింగరాయి సచివాలయం పరిధిలో గల అరిగిపాలెంలో బుధవారం వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరానికి వచ్చిన రోగులను పరీక్షించి అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ పార్థసారథి, గ్రామ సచివాలయం ఎఎన్‌ఎం, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

స్టాండింగ్ కమిటీ ఎన్నికకు ఐదుగురు నామినేషన్

విజయనగరం టౌన్ : పురపాలక శాఖ జారీ చేసిన స్టాండింగ్ కమిటీ ఎన్నిక షెడ్యూల్ అనుసరించి నగరపాలక సంస్థ స్టాండింగ్ కమిటీ ఎన్నిక ప్రక్రియలో భాగంగా బుధవారం నామినేషన్లు చివరి రోజున ఐదుగురు సభ్యులు నామినేషన్ దాఖలు చేశారు. ఎస్‌వివి రాజేష్, అల్లు చాణక్య, సుంకర నారాయణస్వామి, జివి రంగారావు, రేగాన రూపాదేవి కమిషనర్‌కు నామినేషన్ పత్రాలు అందజేశారు. నామినేషన్ దాఖలు ప్రక్రియలో పలువురు కార్పొరేటర్లు పాల్గొన్నారు.

బాగా చదివితేనే భవిష్యత్తు: డిఎస్‌పి

ప్రజాశక్తి - తెర్లాం

విద్యార్థి దశలో బాగా చదివితేనే మంచి భవిష్యత్తు ఉంటుందని బొబ్బిలి డిఎస్‌పి భవిత రెడ్డి అన్నారు. మండలంలోని పెరుమాలి ఎపి మోడల్ కళాశాలలో బుధవారం సంకల్పం కార్యక్రమాన్ని ఎస్ఐ బి.సాగర్‌బాబా ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చదువుకునే వయసులో బాగా చదువుకుంటే రాబోయే రోజుల్లో మంచి భవిష్యత్తు ఉంటుందని సూచించారు. ముఖ్యంగా సెల్‌ఫోన్‌కు దూరంగా ఉండాలని, మత్తు పదార్థాలు గంజాయి, వైన్, స్మోకింగ్, డ్రగ్స్ వంటి వాటికి బానిసలై జీవితాలను నాశనం చేసుకోవద్దని చెప్పారు. చాలా మంది చదువు మధ్యలో ఆపేసి బాల్యవివాహాలు చేసుకుని జీవితాన్ని నాశనం చేసుకొని పోలీస్ స్టేషన్ చుట్టూ తిరుగుతున్న కేసులు వందల్లో వస్తున్నాయని ఇటువంటి కష్టాలను కొని

మాట్లాడుతున్న డిఎస్‌పి భవ్యరెడ్డి

తెచ్చుకోకుండా బాగా చదువుకోవాలని సూచించారు. అనంతరం సచివాలయంలో గ్రామ పెద్దలు సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో మత్తు పదార్థాలు క్రయ విక్రయాలు జరిగినా, ఎవరైనా సేవించినా తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ సమావేశంలో నాయకులు పాల్గొన్నారు.

గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ

ప్రజాశక్తి- బొబ్బిలి

మాతృ, శిశుఆరోగ్య సంరక్షణ సామాజిక బాధ్యత అని ఐసిడిఎస్ పిఒ విజయలక్ష్మి అన్నారు. బుధవారం స్థానిక సంఘ వీధిలో ఉన్న పట్టణ ఆరోగ్య కేంద్రంలో బొబ్బిలి రోటరీ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీహరి, శివకాంత్, కోశాధికారి డేవిడ్ జె.విక్టర్ ఆధ్వర్యంలో తల్లి బిడ్డల ఆరోగ్య సంరక్షణలో భాగంగా 100 మంది గర్భిణులకు పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పిఒ మాట్లాడుతూ తల్లీ బిడ్డల ఆరోగ్యం, సంరక్షణ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక చర్యలు తీసుకుంటున్నాయన్నారు. రోటరీ సంస్థ కూడా వారి ఆరోగ్య సంరక్షణలో భాగస్వామ్యం కావటం అభినందనీయమన్నారు. రోటరీ జిల్లా చైర్మన్ జెసి రాజు మాట్లాడుతూ అంతర్జాతీయ రోటరీ సంస్థ ప్రపంచ వ్యాప్తంగా మాతృ శిశు ఆరోగ్య సంరక్షణకు ప్రపంచ ఆరోగ్య సంస్థతో కలిసి అనేక చర్యలు తీసుకుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో యుహెచ్‌సి డాక్టర్ వెంకట్, పట్టణ టిడిపి అధ్యక్షులు జి.శ్రీనివాసరావు, కౌన్సెల్లర్లు సురేష్, సత్యన్నారాయణ, యుహెచ్‌సి సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలల సందర్శన

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని చామలాపల్లి, గబ్బిరాజుపేట ప్రాథమిక పాఠశాలలను ఎంఇఒ పి.బాలభాస్కరరావు బుధవారం సందర్శించారు. పాఠశాల పరిసరాలు, తరగతి గదులు, కిచెన్ గార్డెన్ పరిశీలించి విద్యార్థులతో తెలుగు, ఇంగ్లీషు, చతిపించడం, రాయించడం, వర్క్ బుక్స్ పరిశీలన, మధ్యాహ్న భోజనం తనిఖీ చేశారు. అనంతరం ఉపాధ్యాయులతో సమావేశం ఏర్పాటు చేసి పలు సూచనలు చేశారు.

1న సామూహిక కుంకుమార్చనలు

ప్రజాశక్తి - నెల్లిమర్ల

రామతీర్థం రామస్వామి దేవస్థానంలో సాముహిక కుంకుమార్చనలు నిర్వహిస్తున్నట్లు దేవస్థానం సహాయ కమిషనర్ వై. శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆగస్టు 1న రామస్వామి దేవస్థానంలో శ్రావణ శుక్రవారం సందర్భంగా సామూహిక కుంకుమార్చన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శ్రావణమాసంలో రెండో శుక్రవారం దేవాలయం మహాలక్ష్మి అమ్మవారి సన్నిధిలో రామచంద్రస్వామికి పుష్పార్చన, మహాలక్ష్మీ అమ్మవారికి కుంకుమార్చన కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. భక్తులందరూ సాంప్రదాయ దుస్తులు ధరించి 1న శుక్రవారం ఉదయం 9 గంటలకు కుంకుమార్చనలో పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు.